క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, ట్రీ ట్రిమ్మింగ్ నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని నిజాంపేట్ సబ్‌స్టేషన్ ఏఈ రాకేష్ ఓ ప్రకటనలో తెలియజేశారు. బృందావన్ హిల్స్, జర్నలిస్ట్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రశాంతి హిల్స్‌కాలనీ, బృందావన్ హిల్స్‌కాలనీ, మధురనగర్ ఫేజ్–3...

- అదే విధంగా మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బండారి లేఅవుట్‌లోని రోడ్ నం.4బీ, 5బీ, 5సీ, 6బీ, 6సీ, 7బీ, 7సీ, 8బీ, 8సీ, 9, 10, జర్నలిస్ట్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

మల్లంపేట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేఆర్‌సీఆర్ కాలనీ, రెయిన్‌బో కాలనీ, ఇందిరనగర్...

- అదే విధంగా నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఎల్‌జీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎస్‌వీఎస్ అపర్ణ, కేజీఎం అపార్ట్‌మెంట్స్, ఇందిరనగర్, బాచుపల్లి విలేజ్‌లో విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ శాంతాకుమార్ తెలిపారు.

గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలో

సుభాష్‌నగర్: మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వీనస్ ఎన్‌క్లేవ్, స్ప్లెండర్ మోడీ, మెట్‌కానిగూడ, పెద్దమ్మనగర్, మారుతినగర్, శారదానగర్....

- మహదేవపురం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు యండమూరి లేఅవుట్, మల్లారెడ్డినగర్–1, 2, ద్వారకనగర్–1, 2, చెన్నకేశవనగర్, జాస్మిన్ గార్డెన్, సంస్కృతి ఎన్‌క్లేవ్, రాంకీ, వడ్డెర బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సత్యనారాయణ తెలిపారు.

కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

కుత్బుల్లాపూర్: గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గోదావరి హోమ్స్, గాయత్రినగర్, టీఎస్‌ఆర్ గార్డెన్స్ ప్రాంతాల్లో....

- మీనాక్షి ఫీడర్ పరిధిలో ఉదయ 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్ప్రింగ్ ఫీల్డ్‌కాలనీ, మీనాక్షి ఎస్టేట్స్, అంగడిపేట్, ఓం బుక్స్...
- రామరాజునగర్ ఫీడర్, జీడిమెట్ల ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రపూర్ణ ఎన్‌క్లేవ్, రామరాజునగర్, లయోలా కాలేజీ రోడ్డు, గ్రీన్ పార్క్, జీడిమెట్ల గ్రామం, గ్రీన్ పార్క్ ఎవెన్యూ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నేడు పియర్‌సన్ స్కూల్ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని పియర్‌సన్ స్కూల్ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ హైందవరెడ్డి అగర్వాల్ ఓ ప్రకటనలో తెలియజేశారు. సాయంత్రం 5.30 గంటలకు పాఠశాల గ్రౌండ్‌లో జరిగే వేడుకలను తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ ఐజీ శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అదే విధంగా మేడ్చల్ డీసీపీ సందీప్‌కుమార్, స్కూల్ ప్రమోటర్ సీతారామ్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారని తెలిపారు.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

జీడిమెట్ల: సుభాష్‌నగర్‌లోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు బిజ్జిలి సాంబయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ఉదయం 6 గంటలకు రుద్రాభిషేకం, 10 గంటలకు నాగమృత్తిక గ్రహణం, అంకురార్పణ, కలశ స్థాపన, అఖండ దీపారాధన, గణపతి నవగ్రహ రుద్రహోమం, 18వ తేదీన మహా శివరాత్రిని పురస్కరించుకుని ఉదయం 3 గంటలకు మహారుద్రాభిషేకం, మధ్యాహ్నం ఒంటి గంటకు నవగ్రహ హోమం, రుద్రహోమం, రాత్రి 12 గంటలకు లింగోద్భవం, ఉదయం 8 గంటలకు శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణం, 19న ఉదయం 11గంటలకు రుద్రహోమం, పూర్ణాహుతి, బలిప్రదానం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

రెండు పర్మిషన్లు ఒకే నిర్మాణం

నోటీసులు ఇచ్చి చోద్యం చూస్తున్న అధికారులు



రెండు అనుమతులు తీసుకుని ఒకే నిర్మాణం చేపడుతున్న ఐదంతస్తుల భవనం ఇదే

కుత్బుల్లాపూర్: అధికారుల నిర్లక్ష్యం... నిర్మాణదారుల ఇష్టారాజ్యం వెరిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న నిర్మాణాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఒక్క అనుమతి తీసుకుంటే ఒక విధంగా నిర్మాణం ఉంటుంది. రెండు అనుమతులు తీసుకుంటే మరోలా ఉంటుంది. ఈ రెండు కలిపి కడితే ఎలా ఉంటుందో అధికారులకే తెలుస్తుంది. ఇంత తతంగం జరుగుతున్నా కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడం టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోంది.

- ఒకవైపు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా... మరోవైపు ప్లానుకు విరుద్ధంగా ఒకే నిర్మాణం చేపట్టడం... అది ప్రధాన రహదారిపై జరుగుతుండడం.. ఈ విషయం తెలుసుకున్న వారు అటు అధికారుల తీరును ఎండగాడుతూ విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికే సదరు నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చినా దర్జాగా నిర్మాణం చేపట్టడం గమనార్హం. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పేట్‌బషీరాబాద్ ఎస్పీజీ గ్రాండ్ హోటల్ ప్రధాన రోడ్డులో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణంపై కథనం.
- కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పేట్‌బషీరాబాద్ ఎస్పీజీ గ్రాండ్ హోటల్ మీదుగా హైటెన్షన్ ప్రధాన రోడ్డు ఉంది. ఈ రోడ్డులో ఓ వ్యక్తి 400 గజాల్లో రెండు పర్మిషన్లు తీసుకుని అధికంగా ఐదంతస్తులు నిర్మాణం చేపట్టాడు. అంతేకాకుండా సెల్లార్ ఏర్పాటు చేశారు. రెండు పర్మిషన్లు తీసుకున్న నిర్మాణదారుడు వేరువేరుగా కట్టాల్సిన నిర్మాణాలను ఒకటి చేసి పూర్తి చేశాడు. ఈ విషయంపై టౌన్‌ప్లానింగ్ అధికారులకు గతంలో పలువురు ఫిర్యాదు చేయగా నోటీసులు జారీ చేశారు.
- అయినప్పటికీ ఇవేమీ పట్టించుకోకుండా ఎటువంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా జీ ప్లస్ టు పర్మిషన్ ఉన్న ఈ నిర్మాణం ఏకంగా 5 అంతస్తులు నిర్మించడం విశేషం. ప్రభుత్వ నిబంధన ప్రకారం 400 గజాల్లో నిర్మాణం చేపడితే ఫీజుల రూపంలో రూ.14 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం డివిషన్ ఉంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తారు. కానీ ఇక్కడ జరిగిన నిర్మాణం మొత్తం అక్రమ నిర్మాణం కావడం.. నిర్మాణం జరుగుతున్నా అడ్డుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

> ఇప్పటికే రెండు నోటీసులు జారీ చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు.. తదుపరి చర్యల కోసం జోనల్ కూల్చివేతల విభాగానికి ఈ ఫైల్ పంపించారని తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న సదరు నిర్మాణదారుడు ఆగమేఘాలపై నిర్మాణాన్ని పూర్తిచేసే దిశగా పనులు వేగవంతం చేయడం విశేషం.

ఎట్టి పరిస్థితుల్లో కూల్చివేస్తాం...

సదరు నిర్మాణదారునికి ఇప్పటికే రెండు నోటీసులు జారీ చేశాం. ఇప్పటికే పలుమార్లు అక్కడ జరుగుతున్న పనులను అడ్డుకున్నాం. కొంతమంది స్థలం విషయంపై ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమే. పూర్తి నివేదికను జోనల్ అధికారులకు పంపించాం. ఆ నిర్మాణానికి జీ ప్లస్ టు పర్మిషన్ ఉంది. అదనంగా నిర్మించిన వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించాం.

– సాంబయ్య, అసిస్టెంట్ సిటీప్లానర్, కుత్బుల్లాపూర్

జగద్గిరిగుట్ట బస్టాండ్ హామీ ఏమైంది?

స్ట్రీట్ కార్నర్ సమావేశంలో కూన శ్రీశైలంగౌడ్



జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట: 'ప్రజా గోస బీజేపీ భరోసా'కార్యక్రమంలో భాగంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని 336, 337, 338 బూత్‌లలో గురువారం శక్తి కేంద్ర స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై స్థానికులతో మాట్లాడారు. జగద్గిరిగుట్టలోని పేదలకు ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు కాలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం రాగానే పేదలకు పక్కా ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి జగద్గిరిగుట్ట ప్రజలని బీఆర్ఎస్ పార్టీ మోసం చేస్తోందన్నారు. ఈసారి మోసపోకుండా బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. జగద్గిరిగుట్ట బస్టాండ్ హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ వసుంధర, బూత్ అధ్యక్షులు గాయత్రి, మధు, డివిజన్ అధ్యక్షుడు పున్నా రెడ్డి, సీనియర్ నాయకులు పడాల సత్యనారాయణ, అర్కల సుధా, అరుణరెడ్డి, సిద్ధారెడ్డి, గణేష్ జా, స్వప్న, అను రాధా, లత, గీత, మధు, బూత్ సభ్యులు, పన్నా ప్రముఖ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మతాల ఆచార వ్యవహారాలపై అవగాహన



ప్రార్థనా స్థలాల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల ప్రదర్శన

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ పాఠశాలలో గురువారం పాఠశాల డైరెక్టర్ టి.కోటిరెడ్డి ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ చిన్నారులు మతపరమైన ప్రార్థనా స్థలాలు, వాటి ప్రాముఖ్యత, ఆయా మతాల ఆచార వ్యవహారాలు, పండుగలపై అవగాహన కల్పించారు. చిన్నారులు వివిధ మతాల సంప్రదాయ వేషధారణలో వచ్చి చూపరులను ఆకట్టుకున్నారు. కేవలం పాఠ్య పుస్తకాలకే చిన్నారులను పరిమితం చేయకుండా వివిధ మతాల సారాలను తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని చేప

కల్యాణ మహోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ



జగద్గిరిగుట్టలోని శ్రీమల్లికార్జునస్వామి భ్రమరాంబిక కేతమ్మ ఆలయంలో ఈనెల 18న నిర్వహించనున్న కల్యాణ మహోత్సవ గోడపత్రికను గురువారం షాపూర్‌నగర్‌లో నివాసంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జేకే శేఖర్‌యాదవ్, నాయకులు మేకల సురేష్‌రెడ్డి, గండిరాజు యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

– రంగారెడ్డినగర్

ఆర్‌డీసీ కాంక్రీట్ సంస్థ దాతృత్వం



నిజాంపేట్ జడ్పీహెచ్ఎస్‌ను సందర్శిస్తున్న సంస్థ ప్రతినిధులు

నిజాంపేట్: ఆర్‌డీసీ కాంక్రీట్ యాజమాన్యం కమ్యూనిటీ సోషల్ రెస్పాన్స్‌లో భాగంగా గురువారం నిజాంపేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.1.20 లక్షలు విలువ చేసే 20 డ్యూయెల్ డెస్క్‌లు, రూ.40వేల విలువ చేసే వేయి నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీసీ కాంక్రీట్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముమ్ముందు తమ సహాయాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండరంగ మూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్టకు ప్రత్యేక బస్సులు

మూసాపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బోరబండ, కేపీహెచ్‌బీ, జగద్గిరిగుట్ట ప్రాంతాల నుంచి కీసరగుట్ట పుణ్య క్షేత్రానికి ప్రత్యేక బస్‌లు నడిపిస్తున్నట్లు కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇషాక్ మహ్మద్ తెలిపారు. శనివారం, ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కూకట్‌పల్లి నుంచి కీసరగుట్టకు, కీసరగుట్ట నుంచి కూకట్‌పల్లికి రాకపోకలు ఉంటాయని తెలిపారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సత్కారం



సుభాష్‌నగర్: సుభాష్‌నగర్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. సుభాష్‌నగర్‌లో రూ. కోటి నిధులతో సీసీరోడ్డు పూర్తయిన సందర్భంగా గురువారం వివిధ బస్తీల ప్రజలు సురేష్‌రెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు ఏ ఇబ్బందులు తలెత్తినా పరిష్కరించేందుకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు

- ఉపకమిషనర్ మంగతాయారు
- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్



కుత్బుల్లాపూర్: హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్‌నగర్ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ వర్తిస్తుందని.. రాజకీయ పక్షాల నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఉపకమిషనర్ మంగతాయారు హెచ్చరించారు.

- సోమ, మంగళ, బుధవారాల్లో ఆయా ప్రాంతాల్లో వెరిసిన ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా గురువారం అధికారులతో సమావేశం అయిన ఆమె ఎక్కడైతే అక్రమంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి ఫైన్లు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
- ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని సూచించారు. కొంతమంది దేవాలయాల వద్ద దేవతా విగ్రహాల ఫొటోలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలను పెట్టి ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. అది కూడా ఎన్నికల నిబంధనలోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.
- గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలో ప్రధాన చౌరస్తాల వద్ద ఉన్న ఫ్లెక్సీలను తొలగించామన్నారు. ఇప్పటి వరకు ఎవరికీ నోటీసులు జారీ చేయలేదని తెలిపారు. ఇక ముందు ఎవరైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే తప్పకుండా వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఉమామహేశ్వర ఆలయ జాతర షురూ



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరుడు



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న దామోదర్ కుటుంబసభ్యులు

సుభాష్‌నగర్: మహాశివరాత్రి పురస్కరించుకుని సుభాష్‌నగర్ డివిజన్ సూరారంలోని ఉమామహేశ్వర ఆలయంలో గురువారం నుంచి జాతర ప్రారంభమైంది. ఈనెల 20 వరకు జరుగనున్న జాతరలో మొదటిరోజు గణపతిపూజ, మహా పూజ, ఉమామహేశ్వరస్వామి కల్యాణం, భజన కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్సీ నవీన్‌రావు మామ దామోదర్ కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారికి పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు ముద్దాపురం మదన్‌గౌడ్ మాట్లాడుతూ... 17న రుద్రయాగం, స్వామివారి ఊరేగింపు, 18న మహాశివరాత్రి పురస్కరించుకొని పాలభిషేకం సాంస్కృతిక కార్యక్రమాలు, 19న మధ్యాహ్నం నుంచి అన్నదాన కార్యక్రమం, 20న ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు.

పరామర్శ

కుత్బుల్లాపూర్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ తండ్రి శనిగెల సాయిలుయాదవ్, బీఆర్ఎస్ నాయకుడు రవికాంత్‌లు ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్ గురువారం వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు.

ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి బాల్‌రెడ్డినగర్‌లో శ్రీమారుతి సాయి ఉమాసంగమేశ్వరస్వామి ఆలయ 15వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ కార్పొరేటర్లు కేఎం గౌరీష్, బొడ్డు వెంకటేశ్వరరావులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



నిజాంపేట్ డిప్యూటీ మేయర్ తండ్రి శెనిగెల సాయిలును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

తల్లి చెంతకు తప్పిపోయిన చిన్నారి

భాగ్యనగర్‌కాలనీ: తప్పిపోయిన మూడు సంవత్సరాల చిన్నారిని కూకట్‌పల్లి పోలీసులు తల్లికి అప్పగించారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాగ్ అమీర్‌లోని పెట్రోలింగ్ చేస్తుండగా ఒంటరిగా తిరుగుతున్న చిన్నారిని గుర్తించిన హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌రావు చిన్నారిని చేరదీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలనీతో పాటు ఆటో స్టాండ్‌లో విచారించగా తన తల్లి వివేకానందనగర్‌లో ఉన్నట్లుగా తెలుసుకొని చిన్నారి తల్లి దుర్గకు అప్పగించారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

రూ.1.4కోట్ల ట్యాక్స్ చెల్లింపు

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం గురువారం ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించిన రూ.1,43,74,094 చెక్కును కమిషనర్‌కు అందజేశారు.

– నిజాంపేట్



కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయం

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని మాణిక్యనగర్, ద్వారకనగర్, మధుసూదన్‌రెడ్డినగర్, డీనగర్, కెఎంజి కాలనీ, ప్రతాప్ ఎస్టేట్స్, అంబేడ్కర్‌నగర్, చెరుకుపల్లి కాలనీల్లో పాదయాత్ర చేసిన హన్మంతరెడ్డి స్థానికంగా కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గడపగడపకు హాత్ సే హాత్ జోడో స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమై పాలనను గాలికొదిలేశారని ఆరోపించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు ఆనంద్‌రావు, ఏ–బ్లాక్ సెక్రటరీ బాలయ్య, మాజీ వార్డు సభ్యుడు ఎండీ జాకీర్, జెస్సీపాల్, హఫీజ్, ఆగమయ్య, సిద్దయ్య, ఈశ్వర్, బాలరాజు, సంగమ్మ, వనజ, సాయి తదితరులు పాల్గొన్నారు.

మాదంటే.. మాది కాదు



రంగారెడ్డినగర్: పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ఇటు జీహెచ్ఎంసీ.. అటు ఐలా అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రధాన రోడ్లలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఇండస్ట్రీయల్ ఏరియాకు ఆనుకుని ఉన్న రోడ్డులో కొన్ని రోజులుగా వ్యర్థాలను తరలించకపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమల బెడద తీవ్రంగా పెరిగింది. ఈ ప్రాంతం పారిశ్రామికవాడకు సరిహద్దులో ఉండటంతో ఇరు శాఖల అధికారులు ఇది తమ పరిధి కాదంటే తమది కాదన్నట్లు వ్యవహరించడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.



బండెనక బండి పెట్టి..

ఇక్కడున్న తోపుడు బండ్లు ఏమి లేకుండా ఇలా ఒకదాని వెనకాల ఒకటి ఎందుకున్నాయన్న సందేహం రావచ్చు. శనివారం మహాశివరాత్రి ఉండటంతో పూజా సామగ్రి, పూలు, పండ్లను విక్రయించడానికి ఒకే వరుసలో బండ్లను పెట్టి తమ అడ్డాలను ఫిక్స్ చేసుకున్నారు. ఈ దృశ్యం జగద్గిరిగుట్ట బస్టాప్ సమీపంలోని సోమయ్యనగర్‌కు వెళ్లే దారిలో 'సాక్షి'కెమెరాకు చిక్కింది.

– జగద్గిరిగుట్ట

రంగారెడ్డినగర్: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి రాకపోకలకు ఆటకంగా మారుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డినగర్‌లోని బస్తీ దవాఖానా సమీపంలోని అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణం ఇటీవల పూర్తయ్యింది. పనుల తర్వాత కాంక్రీట్ వ్యర్థాలను సదరు కాంట్రాక్టర్ ప్రధాన రోడ్డుకు ఓ వైపు డంప్ చేశాడు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందుల ఏర్పడుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. రాత్రివేళ్లలో వేగంగా వచ్చే ద్విచక్ర వాహనాలు కాంక్రీట్ దిమ్మెలను ఢీకొన్ని ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతే కాకుండా సదరు అంతర్గత రోడ్డు నుంచి ప్రధాన రోడ్డుకు రాకపోకలు సాగించేందకు వీలు లేకుండా పోయింది.



కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. తొలగించడంలో అలసత్వం